క్లుప్తంగా

విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలి



కాకుమాను :ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రోజూ పౌష్టికాహారాన్ని అందించాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ చెప్పారు. స్థానిక అంబేడ్కర్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని గురువారం ఆయన పరిశీలించారు. కెనడీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడంతోపాటు వారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. పాఠశాలలకు సూచించిన మెనూ ప్రకారం రోజూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఆయన ఆదేశించారు.

ఆస్తి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి



పొన్నూరు: ఆస్తి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 31 వార్డులలో పన్ను బకాయిలు రూ. కోట్లలో ఉన్నాయని, పన్ను వసూలు సకాలంలో జరిగితేనే పట్టణాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. సిబ్బందికి నిర్దేశించిన రోజువారీ లక్ష్యాలను అధిగమించాలని పేర్కొన్నారు. పట్టణంలో మొత్తం 11,641 అసెస్‌మెంట్లు ఉండగా వాటి ద్వారా ఏటా రూ. 5,70,40,910 కోట్లు పన్నుల రూపంలో మున్సిపాలిటీకి ఆదాయం సమకూరుతుందన్నారు. ఇప్పటి వరకు రూ. 3,48,69,750 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. మిగిలిన రూ. 2,21,71,160 కోట్లు త్వరితగతిన వసూలు చేయాలని తెలిపారు. సమావేశంలో ఆర్‌ఓ టి. వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయురాలి దాతృత్వం అభినందనీయం



పెదకాకాని: పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయురాలు విరాళం అందజేయడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు నంబూరు తిరుపతిరావు ప్రశంసించారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు సహ ఉపాధ్యాయినిగా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన అవుతు ఇంద్రావతి పాఠశాలలో భోజనశాల నిర్మాణం కోసం గురువారం లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఇంద్రావతికి ప్రధానోపాధ్యాయుడు నంబూరు తిరుపతిరావు, ఎస్ఎంసీ చైర్మన్ చాదరాజుపల్లి వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

భవిష్యత్తు గ్రీన్ హైడ్రోజన్‌దే



గుంటూరు ఎడ్యుకేషన్: ఇంధన రంగంలో భవిష్యత్తు గ్రీన్ హైడ్రోజన్‌దేనని హాంకాంగ్ పాలిటెక్నిక్ యూనివర్సిటీ ప్రతినిధి డాక్టర్ బి. గోరవర్ధన్‌బాబు పేర్కొన్నారు. జేకేసీ నగర్‌లోని జేకేసీ కళాశాలలో గురువారం రసాయనశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో ''స్థిరమైన అభివృద్ధి కోసం గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి–వినియోగం''పై గురువారం అంతర్జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గోవర్ధన్‌బాబు మాట్లాడుతూ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిపై తాను చేసిన పరిశోధనలను విశ్లేషణాత్మకంగా వివరించారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రతినిధి డాక్టర్ బి.జయదేవ్ కౌశిక్ మాట్లాడుతూ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, వినియోగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు చేసిన పరిశోధకులకు వివరించారు. పర్యావరణానికి హాని కలిగించని ఇంధన వనరులను వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని వెల్లడించారు. కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో బొగ్గు, డీజిల్, భారీ ఇంధన చమురుతో పోలిస్తే గ్రీన్ హైడ్రోజన్ క్లీన్ ఎనర్జీగా ఉపయోగపడుతుందని అన్నారు. గ్రీన్ హైడ్రోజన్ ప్రాముఖ్యతను చాటుతూ, విద్యార్థులకు, పరిశోధకులకు మౌఖిక, పోస్టర్ ప్రదర్శన పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. వర్క్‌షాప్‌లో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్కే ప్రసాద్, వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ ఎం. గౌరీశంకర్, డాక్టర్ ఎస్. మాధవి, డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, విజ్ఞాన్ వర్సిటీ విశ్రాంత వీసీ డాక్టర్ వి. గోవర్ధనరావు, జోషిల్ సంస్థ కెమిస్టులు పి.వెంకటేశ్వర్లు, డి.వాసుబాబు పాల్గొన్నారు.

మామూలిస్తే ఎస్..సీ..!

- వార్డెన్ల నుంచి నెలవారీగా డబ్బు గుంజుతున్న అధికారులు
- బిల్లులు ప్రాసెస్ చేయాలంటే పెద్ద మొత్తంలో ముట్టజెప్పాల్సిందే
- పీఆర్సీ, పే స్కేల్స్ వేయాలన్నా ఉన్నతాధికారుల కటాక్షం తప్పనిసరి
- అధికారులకు బినామీలుగా కథ నడిపిస్తున్న డ్రైవర్లు, గుమస్తాలు
- తప్పు చేసినా భారీగా ముట్టజెబితే అన్నీ అనుకూల ఆదేశాలే

ఎస్సీ వెల్ఫేర్‌లో జోరుగా వసూళ్ల పర్వం



ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయం

నెహ్రూనగర్: ఎస్సీ వెల్ఫేర్‌లో మామూళ్ల పర్వం నడుస్తోంది. ఏ పనైనా ముడుపులు ఇస్తేనే పూర్తవుతుంది. ఏ తప్పు చేసినా ప్రతి దానికి ఒక రేటు అని ఫిక్స్ చేస్తే ఆ తప్పులు కూడా మాఫీ చేస్తారు వెల్ఫేర్ అధికారులు. తమను ప్రసన్నం చేసుకున్న వారికి కలెక్టర్లు ఇచ్చిన రిపోర్టులను కూడా మాయం చేయగల సమర్థులు సంబంధిత కార్యాలయంలో ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఇంత జరుగుతున్నా జిల్లా ఉన్నతాధికారులు మామూళ్ల పర్వంపై నోరు మెదపడం లేదంటే వారిని కూడా ఎంతలా మ్యానేజ్ చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

చర్యలు శూన్యం..

గతంలో గుంటూరు నగరంలో బాలికల హాస్టల్స్‌లో పలుమార్లు బాలికలను కొంత మంది ఆకతాయిలు బయటకు తీసుకువెళ్లిన సందర్భాల్లో వార్డెన్లపై తూతూమంత్రంగా చర్యలు తీసుకున్నారు.

కేసులు పెండింగ్‌లో ఉన్నా ప్రమోషన్లు

సర్వీస్ మేటర్స్‌పై కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ ముడుపులు సమర్పించుకుంటే సీనియర్స్‌ను కాదని జూనియర్స్ కూడా ప్రమోషన్లు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. దాదాపు 7 కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి రిప్లై ఇవ్వాలని కోర్టులు అధికారులను ఆదేశించినప్పటికీ స్పందించడం లేదు. రూ.3 లక్షలు తీసుకుని గత కొద్ది నెలల క్రితం క్లాస్ 4 నుంచి వార్డెన్స్‌గా, వార్డెన్స్ నుంచి ఏఎస్‌డబ్ల్యూఓలుగా ప్రమోషన్లు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి.

తొమ్మిదేళ్లుగా రెండు హాస్టళ్లకు ఒక్కరే..

గుంటూరు జిల్లాలో 34 ఎస్సీ సంక్షేమ హాస్టల్స్ ఉన్నాయి. పెదనందిపాడు ఎస్సీ బాలుర హాస్టల్‌లో రెగ్యులర్ వార్డెన్‌గా పనిచేస్తూనే 9 సంవత్సరాలపైబడి గుంటూరులోని ఎస్సీ కాలేజీ బాయ్స్ హాస్టల్‌కు ఇన్‌చార్జ్ వార్డెన్‌గా ఒకరు విధులు నిర్వహిస్తున్నారు. పెదనందిపాడులో కొద్ది నెలల క్రితం ఓ విద్యార్థిని హాస్టల్‌లో పనిచేసే ఓ చిరుద్యోగి కొట్టడం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. చిరుద్యోగిని విధుల నుంచి తప్పించారు. వార్డెన్‌పై చర్యలు లేవు.

అడిగినంత ఇస్తేనే బిల్లులు ప్రాసెస్

ప్రతి నెల విద్యార్థులకు ఇచ్చే డైట్ చార్జీల బిల్లులు ప్రాసెస్ చేయాలంటే అధికారులను ప్రసన్నం చేసుకోవాల్సిందే. తమ అనుకునే వారికి బిల్లులు సక్రమంగా లేకపోయినప్పటికీ మంజూరు చేస్తున్నారని సిబ్బందే చెబుతున్నారు. పీఆర్సీ రివిజన్, ఇంక్రిమెంట్లు కలపాలన్నా అధికారులను ప్రసన్నం చేసుకుంటేనే పని పూర్తవుతుంది. సాంఘిక సంక్షేమ శాఖలో అధికారుల వద్ద పనిచేసే డ్రైవర్లు, గుమస్తాలే హాస్టల్ వార్డెన్ల నుంచి నెలవారీ మామూళ్లు చేసి అధికారులు ఇస్తుంటారని ఆరోపణలు ఉన్నాయి.

'గొయ్యో'మొర్రో



నడింపాలెం నుంచి 16వ నంబరు జాతీయ రహదారికి వెళ్లే రోడ్డులో నడిరోడ్డుపై గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. స్థానిక దళితవాడ చర్చి సమీపంలో రోడ్డు మధ్యలో ఒక గుంత, కాలువకు ఆనుకుని మరో గుంత ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ఎవరైనా ద్విచక్రవాహన చోదకులు ఆదమరిచి వాహనం నడిపితే ప్రమాదం బారిన పడాల్సిన దుస్థితి. ఆ ప్రాంతాల్లో కనీసం ఆర్అండ్‌బీ అధికారులు సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు.
– ప్రత్తిపాడు

అనుమానాస్పదస్థితిలో గుర్తు తెలియని యువకుడు మృతి



చేబ్రోలు: చేబ్రోలు కొమ్మమూరు చానల్ పక్కన డ్రెయిన్‌లో గుర్తు తెలియని యువకుడు అనుమానస్పద స్థితిలో మృతి చెందిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చేబ్రోలు – మంచాల గ్రామాల మధ్యన ఉన్న కొమ్మమూరు చానల్ పక్కన ఉన్న కాలువలో సుమారు 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయుస్సు కలిగిన యువకుడు మృతి చెందినట్లు స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతుని శరీరంపై లేత గులాబీరంగు చొక్కా, నావీ బ్లూ ప్యాంటు ఉన్నాయి. వీఆర్‌వో ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్ఐ డి.వెంకట కృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు ప్రమీలా సెల్వరాజ్ జ్ఞాపకార్థ కూడిక

పెదకాకాని: బైబిల్ మిషను స్త్రీల సభల కన్వీనర్, రెండవ శనివారం ఉపవాస ప్రార్థనల వ్యవస్థాపక నిర్వహకులు డాక్టర్ జె ప్రమీలా సెల్వరాజ్ జ్ఞాపకార్థ కూడిక శుక్రవారం ఉదయం 10 గంటలకు పెదకాకాని స్వస్థిశాలలో ప్రారంభమవుతుందని ఆమె కుమారుడు, బైబిలు మిషను అధ్యక్షులు రెవరెండ్ జె. శామ్యేల్ కిరణ్ అన్నారు. పెదకాకాని స్వస్థిశాలలో గురువారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హాజరై దేవుని ఆశీర్వాదాలు పొందాలని కోరారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): స్థానిక బ్రాడీపేట 2/13వ అడ్డరోడ్డు ఓంకార క్షేత్రం కుర్తాళం శ్రీసిద్ధేశ్వరీ పీఠపాలిత ఓంకార క్షేత్రం ఆవరణలో నిర్వహిస్తున్న 91వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవం- 95వ సంఘ వార్షికోత్సవాలు గురువారం మూడో రోజుకు చేరాయి. ఉదయం నగర సంకీర్తన, శ్రీహనుమత్ లక్ష్మణ సీత సమేత కోదండరామస్వామి వార్లకు తులసి అర్చనలు నిర్వహించారు. శ్రీసీతారాముల వారి కల్యాణం ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ చేపట్టారు. కల్యాణం, తలంబ్రాలు విశేష హారతి, మంత్రపుష్పం జరగ్గా అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. రుద్రాభట్ల సూర్యలక్ష్మి బృందం రాముల వారిపై పలు కీర్తనలను ఆలపించారు. శ్రీమద్ రామాయణ ప్రవచనం అరణ్య కాండలోని విశేషాలను మంచికంటి వెంకటసత్యవతి వివరించారు. కార్యదర్శి నంబూరు వెంకటశ్రీమన్నారాయణమూర్తి మాట్లాడుతూ శుక్రవారం పద్మావతి ఆండాల్ సమేత శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆరోగ్య సమస్యలపై అప్రమత్తత అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ అస్మా

పొన్నూరు: ఆరోగ్య సమస్యలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ షేక్ అస్మా, స్పందన అన్నారు. పట్టణంలోని సెయింట్ థామస్ స్కూల్‌లో గురువారం బాలాజీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థినులకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అస్మా మాట్లాడుతూ స్త్రీలలో ప్రధానంగా వచ్చే గైనకాలజీ సమస్యలు, సెర్వికల్ క్యాన్సర్ (గర్భాశయ క్యాన్సర్)ను వివరించారు. సర్వైకల్ క్యాన్సర్‌ను నివారించేందుకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రభావవంతంగా పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సెర్వికల్ క్యాన్సర్‌ను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలు అవసరం

యువజన సర్వీసులశాఖ సీఈవో చంద్రముని రంగల్



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాన్ని కలిగి ఉండాలని యువజన సర్వీసులశాఖ సీఈవో చంద్రముని రంగల్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో గురువారం యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా చంద్రముని రంగల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యం ఏర్పరచుకుని, దానిని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. అటువంటి వారే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని అన్నారు. కెరీర్ కౌన్సెలింగ్ శిక్షకుడు డాక్టర్ ఏ.వీర రాఘవరావు మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనా విధానాలు గొప్పగా ఉన్నప్పుడే వాటి ప్రభావంతో ఆచరణ సాధ్యమై, జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోగలరని అన్నారు. వాణిజ్య రంగంలో కృత్రిమ మేధ కీలకం కానుందని, విద్యార్థులు ఏఐపై విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా వ్యాపార, వాణిజ్య రంగాల్లో కృత్రిమ మేధ, డేటా సైన్స్ ప్రభావం కీలంగా మారనుందని తెలిపారు. యువజన సర్వీసుల శాఖ మేనేజర్ బి. రాధిక మాట్లాడుతూ విద్యార్థులకు దిశానిర్దేశనం చేయడం ద్వారా సరైన మార్గంలో పయనించడంతో పాటు భవిష్యత్తులో జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోగలరని అన్నారు. సదస్సులో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ తన్నీరు శ్రీనివాసరావు, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి జి. సురేష్, పీజీ వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు, అధ్యాపకులు, పి శ్రీలత, ఎస్ వరలక్ష్మి, ఎన్. సంగీత, వైసీహెచ్ మణికంఠ, సయ్యద్ షెహనాజ్, ఆర్. జయశైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయ గణపతి విహారం

నగరంపాలెం: స్థానిక ఎస్‌వీఎస్‌కాలనీ పద్మావతి గోదాసమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో నిర్వహిస్తున్న శ్రీవిజయ గణపతి స్వామి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు మూడో రోజుకు చేరాయి. గురువారం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, నిత్య హోమం, గణపతి హోమం, తిరువంజన సేవ, మూలమూర్తికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం విజయ గణపతి స్వామి దివ్య రథోత్సవం ప్రధాన రహదారిలో కొనసాగింది. 42వ డివిజన్ కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్ రథోత్సవాన్ని ప్రారంభించారు. పాతగుంటూరు శ్రీలక్ష్మీ కోలాట భజన సమాజం వారు కోలాట ప్రదర్శన చేపట్టారు. ఆలయ అధ్యక్షుడు వట్టికూటి పూర్ణచంద్రరావు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



పుర వీధుల్లో రథోత్సవం



విజయ గణపతి స్వామి

దుఃఖినో 'భవంతి'



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెంలో సుమారు రూ. 40 లక్షల ప్రజాధనంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం నిరుపయోగంగా మారింది. నిర్మాణ పనులు పూర్తయినా భవనాన్ని కూటమి నేతలు ప్రారంభించలేదు. అధికారులూ పట్టించుకోవడం లేదు. దీంతో భవనం ఆవరణ అంతా పెద్దపెద్ద పిచ్చిచెట్లు, ముళ్లపొదలు పెరిగాయి. అధికారుల నిర్వాకాన్ని వెక్కిరిస్తున్నాయి.
– ప్రత్తిపాడు

అంకిరెడ్డిపాలెం జెడ్పీ పాఠశాల వార్షికోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు

గుంటూరు రూరల్: అంకిరెడ్డిపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వార్షికోత్సవం అట్టహాసంగా గురువారం నిర్వహించారు. ఉదయం జూనియర్ కాలేజీ విద్యార్థినులు ఫేర్ వెల్ కార్యక్రమాలు ఆటపాటల మధ్య ఉల్లాసంగా జరుపుకున్నారు. అనంతరం జరిగిన వార్షికోత్సవానికి ప్రధానోపాధ్యాయురాలు చావలి సరోజిని అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో తిరుమల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ నారాయణ, చైతన్య కళాశాల ఏజీఎం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విజ్ఞానం వినోదం సమ్మేళనమే విద్యని తెలిపారు. అభిలాష, పట్టుదల ఉంటే కార్పొరేట్ విద్యా సంస్థలు అయినా గవర్నమెంట్ స్కూల్స్ అయినా ఒకటేనన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరింపజేశాయి. కార్యక్రమంలో సిద్ధార్థ కాలేజీ వ్యాయామ అధ్యాపకుడు మున్నంగి సంజీవరెడ్డి. జూనియర్ కాలేజీ ఇంచార్జి రామచంద్రరావు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు కుర్రా పుల్లారెడ్డి. కుర్రా సాంబిరెడ్డి. లేళ్ల అప్పిరెడ్డి, శ్యామల రఘురామిరెడ్డి. స్టాఫ్ సెక్రెటరీ హనుమంతరావు. ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్మీకంపోస్టు ఎరువుతో మేలైన పంటలు



ఎరువులను కొనుగోలు చేసిన ప్రజలతో డీపీవో సాయికుమార్, ఎంపీడీవో శ్రీనివాసరావు

గుంటూరు రూరల్: వర్మికంపోస్ట్ ఎరువుతో ఇంటివద్దే ఆరోగ్యకరమైన పంటలను పండించుకోవచ్చని డీపీఓ సాయికుమార్, ఎంపీడీవో బండి శ్రీనివాసరావులు తెలిపారు. గురువారం మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలోని వర్మికంపోస్ట్ షెడ్‌ను ఆయన పరిశీలించారు. ఎరువుల కొనుగోలును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన పంటల ద్వారా ప్రజలు ఆరోగ్యాలను కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా 153 కేజీల వర్మీ కంపోస్ట్ ఎరువులను అమ్మారు.
కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ నల్లపాటి లలితకుమారి, పంచాయతీ కార్యదర్శి వి రవి, తదితరులు పాల్గొన్నారు.

కాఫీ మితంగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదే

డాక్టర్ నాగశ్రీహరిత



గుంటూరు మెడికల్: కాఫీని మితంగా తీసుకుంటే మంచిదేనని సీనియర్ కార్డియాలజిస్ట్, గుంటూరు కిమ్స్ శిఖర హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పర్వతనేని నాగశ్రీహరిత అన్నారు. గురువారం గుంటూరులోని హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాఫీ తాగడం శరీరానికి మంచిదా? కాదా ?అనేది చాలా మందిలో ఉన్న సందేహం ఉందన్నారు. కాఫీ విషయంలో ఇంతకముందు కంటే ఇప్పుడు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. మహిళల్లో కాఫీ తాగడం వల్ల అల్జీమర్స్, గుండె సంబంధిత సమస్యలు రావడం కొంత మేరకు తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీనికి కారణం కాఫీలో కెఫీన్ తోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, ఇతర క్రియాశీల పదార్థాలు కూడా ఉండటమేనని వెల్లడించారు. ఇవి శరీరంలో ఇన్‌ఫ్లామేషన్ తగ్గించి వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని చెప్పారు. రోజు ఒక నిర్దిష్ట సమయంలో కాఫీ తాగేవారిలో బ్రెయిన్ స్ట్రోక్ ప్రమాదం తగ్గుతుందని ఇటీవల పరిశోధనలో వెల్లడైందన్నారు. అయితే కాఫీ ఎప్పుడంటే అప్పుడు ఎక్కువగా తీసుకోవడం వల్ల బ్రెయిన్ స్ట్రోక్ ప్రమాదం పెరుగుతుందన్నారు. అధిక రక్తపోటు, షుగర్, అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారు కాఫీ తాగకపోవడం మంచిదన్నారు.

జీజీహెచ్ సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్‌గా సుధాకర్



గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌లో ఐటీ విభాగం సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్‌గా పత్తి సుధాకర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు గురువారం సుధాకర్ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణను కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన సుధాకర్ గతంలో వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో అవుట్‌సోర్సింగ్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేశారు. ఎంసీఏ విద్యార్హత ఉండటంతో ఇటీవల కాలంలో ప్రభుత్వం విడుదల చేసిన ఐటీ సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోగా ఎంపికయ్యారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మొట్టమొదటిసారిగా టీచింగ్ ఆస్పత్రుల్లో కంప్యూటర్లు అనుసంధానం చేసేందుకు ఐటీ ఆధారిత సేవలు సులువుగా కొనసాగేందుకు అడ్మినిస్ట్రేటర్‌లను నియమించింది. కాంట్రాక్టు పద్ధతిలో వీరు ప్రభుత్వ సర్వీసులో కొనసాగనున్నారు.

రోటరీ ఇంటర్నేషనల్ నిరంతర సేవలు



నగరంపాలెం: రోటరీ క్లబ్స్ ఇంటర్నేషనల్ నిరంతరం సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నాయని 3105 మాజీ గవర్నర్ అన్నే ప్రభాకర్ అన్నారు. బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై గురువారం రాత్రి రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో 'రోటరీ వొకేషనల్ ఎక్సలెన్స్ అవార్డ్స్' 2024–25 నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ నటుడు జీవ (కొచ్చర్ల దయారత్నం), డాక్టర్ నూతలపాటి శ్రీనివాసరావు, చార్టెడ్ అకౌంటెంట్ పి.వి.మల్లికార్జునరావు, పారిశ్రామికవేత్త దేసు సూర్యప్రకాశరావు, సోషల్ మీడియాకు సంబంధించి ఏలూరి నందినిలను సత్కరించారు. క్లబ్ అధ్యక్షులు గాలి సుబ్బారావు అధ్యక్షతన వహించారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, ఫాస్ట్ జిల్లా గవర్నర్ వడ్లమాని రవి, సహాయ గవర్నర్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు, కార్యదర్శి డాక్టర్ పొందూరి శివప్రసాద్, కోశాధికారి టి.వి.సీతారామయ్య, ఒకేషనల్ అవార్డు డైరెక్టర్ వెలనాటి కోటేశ్వరరావు, ముప్పాళ్ళ సుబ్బారావు, సీతా రమేష్, శ్రీధర్‌బాబు, ఎల్ఐసి ప్రసాద్, పీవీ.సత్యనారాయణ, యశ్వంత్ పాల్గొన్నారు.